ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

కృష్ణా జిల్లా వార్తలు

మంగళవారం 24 సెప్టెంబరు 2024



ఎంపీ కేశినేని చిన్ని నివాసంలో సమావేశమైన ఎమ్మెల్యేలు, టీడీపీ జిల్లా అధ్యక్షులు



జిల్లాలోని రెవెన్యూ విభాగంలో బదిలీ ప్రక్రియ దుమారం రేపుతోంది. ఉద్యోగి పనిచేసేది ఒక చోటైతే బదిలీ జాబితాలో మరో చోట పేరు ఉన్నట్లు తెలుస్తోంది. ఇదంతా కలెక్టరేట్‌లో కీలక అధికారి, మరో ముగ్గురు అధికారులు కలిసి తమ ఇష్టానుసారంగా బదిలీల జాబితాలు తయారు చేయడమే కారణం అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో నియోజకవర్గ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని శాసన సభ్యులు ఇచ్చిన సిఫార్సు లేఖలను సైతం బుట్ట దాఖలు చేశారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వివాదాస్పద పనితీరు కలిగిన ఉద్యోగులను సైతం వేరే ప్రాంతానికి బదిలీ చేసినట్లు జాబితాలో చూపించి, డిప్యుటేషన్ పేరుతో మళ్లీ పాతపోస్టులోనే కొనసాగేలా చేయడం పలు అనుమానాలకు తావిస్తోంది.

- ఆంధ్రజ్యోతి, మచిలీపట్నం

రెవెన్యూ బదిలీలపై దుమారం

- డిప్యుటేషన్ల పేరుతో సీట్లు వదలని ఉద్యోగులు
- చెత్తబుట్టలోకి ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలు
- పాత స్థానాల్లోనే వివాదాస్పదుల కొనసాగింపు

పని ఇక్కడ.. బదిలీ జాబితాలో పేరు అక్కడ

ఆయన సీటు పదిలం

జిల్లాలో 53 మంది డిప్యూటీ తహసీల్దార్(డీటీ)లను బదిలీ చేస్తూ ఈ నెల 21వ తేదీన డీఆర్వో కె.చంద్రశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ జాబితా బయటకు రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. మచిలీపట్నం ఆర్డీవో కార్యాలయంలో భూమి విభాగంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్నట్లుగా వి.సుభాష్‌చంద్రను చూపారు. అయితే ఈ డీటీ కలెక్టరేట్‌లోని భూమి విభాగంలో ప్రస్తుతం పనిచేస్తున్నారు. ఈ ఉద్యోగిని మచిలీపట్నం ఆర్డీవో కార్యాలయం నుంచి పెడన తహసీల్దార్ కార్యాలయం రీ సర్వే విభాగం డీటీగా బదిలీ చేసినట్లుగా ప్రస్తుత బదిలీల జాబితాలో చూపి, కలెక్టరేట్‌కు డిప్యుటేషన్ వేసినట్లుగా చూపడం గమనార్హం. ఈ ఉద్యోగి పనితీరు బాగోలేదని ఇటీవల ప్రజాదర్బార్‌లో కూటమి నేతలు కొందరు ఫిర్యాదు చేశారు. అయినా రెవెన్యూ అధికారులు సదరు ఉద్యోగిని పాతస్థానంలోనే కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం విశేషం.

నాడు కలెక్టర్ బదిలీ కాగానే మళ్లీ వెనక్కి..

కలెక్టరేట్‌లోని భూమి విభాగంలో పనిచేసే సదరు ఉద్యోగి పనితీరుపై అనేక ఆరోపణలు రావడంతో రెండేళ్ల కిందట అప్పటి కలెక్టర్ రంజిత్ బాషా గుడివాడ డివిజన్‌కు బదిలీ చేశారు. ఆ తర్వాత కలెక్టర్ బదిలీపై వెళ్లిన కొద్దిరోజులకే మళ్లీ ఈ ఉద్యోగి కలెక్టరేట్‌కు వచ్చేశారు. దీర్ఘకాలంగా కలెక్టరేట్‌లో పనిచేస్తున్న ఈ డీటీని మళ్లీ ఇక్కడే కొనసాగించడం వెనుక కారణాలు ఏమై ఉంటాయనే అంశంపై రెవెన్యూ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

అంతా డిప్యుటేషన్ల డ్రామా!

- కోడూరు తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న సిహెచ్.ప్రభు కిషోర్ మచిలీపట్నం ఆర్డీవో కార్యాలయంలో ల్యాండ్ అక్విజేషన్ విభాగంలో డిప్యుటేషన్‌పై దీర్ఘకాలంగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం జరిగిన బదిలీల్లో ఈ డీటీని కృత్తివెన్ను తహసీల్దార్ కార్యాలయం డీటీగా బదిలీ చేసినట్లుగా చూపారు. మళ్లీ ఆర్డీవో కార్యాలయంలోనే డిప్యుటేషన్‌పై నియమించారు.
- పామర్రు తహసీల్దార్ కార్యాలయం ఎన్నికల విభాగం డీటీగా ఘంటసాల నుంచి సిహెచ్. చిట్టిబాబును నియమించారు. పామర్రు తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల విభాగంలో పనిచేస్తున్న ఒక ఉద్యోగి, ఈ డీటీని పామర్రు రాకుండా అడ్డుకునేందుకు సోమవారం కలెక్టరేట్‌లోని అధికారులకు పలువురు పెద్దలతో ఫోన్లు చేయించిన విషయం బయటకు పొక్కడంతో ఈ అంశం వివాదాస్పదమైంది.
- గన్నవరం నియోజకవర్గంలోని బాపులపాడు తహసీల్దార్ కార్యాలయంలో పనిచేసేందుకు ఉద్యోగులు పోటీ పడుతున్నారు. గన్నవరం తహసీల్దార్ కార్యాలయం డీటీగా పనిచేస్తున్న టి.అరుణ్‌కుమార్‌ను బాపులపాడు తహసీల్దార్ కార్యాలయ డీటీగా బదిలీ చేశారు. అయినా ఈ డీటీ పోస్టు కోసం మరికొందరు పోటీపడటం గమనార్హం.

కొలిక్కిరాని వీఆర్వోల జాబితా

గన్నవరం నియోజకవర్గంలో గతంలో పనిచేసిన వీఆర్వోలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులను బదిలీ చేయాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు గతంలోనే అధికారులకు చెప్పారు. ఇక్కడ పనిచేసేందుకు అధిక శాతం మంది వీఆర్వోలు పోటీ పడుతుండటంతో బదిలీల జాబితా తయారీ ఆలస్యమవుతుందని రెవె న్యూ ఉద్యోగులు పేర్కొంటున్నారు. బందరు మండలం కోన 1, 2 రెవెన్యూ గ్రామాల పరిధిలో 7,500 ఎకరాల ప్రభుత్వ, అసైన్డ్ భూమి ఉంది. ఈ గ్రామానికి వీఆర్వోగా వచ్చేందుకు తీవ్ర పోటీ నెలకొంది.

కోరుకున్న స్థానం కోసం పైరవీలు

జిల్లాలోని 25 మండలాల్లో పనిచేస్తున్న 51 మంది సీనియర్ అసిస్టెంట్లు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ డీఆర్వో కె.చంద్రశేఖర్ ఈ నెల 21న ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బదిలీల్లో తాము కోరుకున్న స్థానాలు రాకపోవడంతో కొందరు ఉద్యోగులు, కూటమి నాయకుల ద్వారా శాసనసభ్యుల వద్దకెళ్లి ఫోన్లు చేయించి రెవెన్యూ ఉన్నతాధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో ప్రస్తుతం విడుదల చేసిన బదిలీల జాబితాల్లో చేర్పులు, మార్పులు ఉంటాయని రెవెన్యూ ఉద్యోగులు పేర్కొంటున్నారు.

నెలనెలా సమావేశమవుదాం

- వరద నుంచి నగరాన్ని సాధారణ స్థితికి తెచ్చిన ముఖ్యమంత్రికి ధన్యవాదాల తీర్మానం
- ఉమ్మడి కృష్ణాజిల్లాలోని ఎమ్మెల్యేలతో ఎంపీ కేశినేని చిన్ని ప్రత్యేక సమావేశం

వన్‌టౌన్, సెప్టెంబరు 23: ఉమ్మడి కృష్ణాజిల్లాలోని పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలు సోమవారం రాత్రి విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) నివాసంలో సమావేశమయ్యారు. నెలకు ఒకసారి అందరూ సమావేశం కావాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. వరదల సమయంలో సీఎం చంద్రబాబు చూపించిన చొరవ, విజయవాడ నగరాన్ని సాధారణ స్థితికి తీసుకువచ్చిన విధానం, బాధితులను ఆదుకునేందుకు ప్రకటించిన నష్ట పరిహారంపై సంతృప్తి వ్యక్తం చేస్తూ ధన్యవాద తీర్మానానికి ఆమోదం తెలిపారు. దసరా మహోత్సవాల సందర్భంగా దుర్గగుడిలో చేపట్టిన ఏర్పాట్లు గురించి చర్చించారు. జిల్లాలోని ప్రజా సమస్యలు, రాష్ట్రంలో వర్తమాన రాజకీయ పరిస్థితులపై సమీక్షించారు. ఈ సమావేశంలో ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల అధ్యక్షులు నెట్టెం రఘురాం, కొనకళ్ల నారాయణ, మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, వెనిగండ్ల రాము, యార్లగడ్డ వెంకట్రావు, కొలికపూడి శ్రీనివాసరావు, తంగిరాల సౌమ్య, శ్రీరాం రాజగోపాల్, కాగిత కృష్ణప్రసాద్, వసంత కృష్ణప్రసాద్, బోడె ప్రసాద్, వర్ల కుమార్ రాజా, కామినేని శ్రీనివాస్ పాల్గొన్నారు.

దేవదాయ శాఖలో బదిలీల జాతర!

ఆర్టీసీ ఉద్యోగులకు ఫ్లడ్ లోన్స్

6లో



పోలీసులు సీజ్ చేసిన టిప్పర్, జేసీబీ

పోలీసులపై దౌర్జన్యం..దాడి

నిమ్మగడ్డ రేవులో ఇసుక అక్రమ రవాణా

- అడ్డుకునేందుకు వెళ్లిన పోలీసులపై దుశ్చర్య
- టిప్పర్, జేసీబీ సీజ్..నలుగురిపై కేసు నమోదు
- ముగ్గురి అరెస్ట్, రిమాండ్ విధింపు

చల్లపల్లి, సెప్టెంబరు 23 : చల్లపల్లి మండలం నిమ్మగడ్డ రేవులో ఆదివారం రాత్రి తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు రెవెన్యూ అధికారులతో కలిసి వెళ్లిన పోలీసులపై అక్రమార్కులు దౌర్జన్యం చేసి దాడికి తెగబడ్డారు. దీంతో ఇసుక తవ్వుతున్న జేసీబీని, టిప్పర్‌ను సీజ్ చేసిన పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. చల్లపల్లి మండలం నిమ్మగడ్డ రేవులో ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయనే రెవెన్యూ అధికారుల ఫిర్యాదుతో నైట్‌బీట్ పోలీసులు రేవులోకి వెళ్లారు. అక్కడ జేసీబీతో ఇసుక తవ్వకం చేపడుతుండగా అడ్డుకునే ప్రయత్నం చేయగా, ఆపేందుకు మీరెవరంటూ ఇసుక అక్రమార్కులు దౌర్జన్యానికి దిగారు. ఆపై దాడి చేసి వారిని పక్కకు తోసివేశారు. సమాచారం అందుకున్న చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు, ఎస్ఐ పి.ఎస్.వి.సుబ్రహ్మణ్యం సిబ్బందితో కలిసి ఘటనాస్థలానికి చేరుకున్నారు. వీరి రాకతో స్థానికులు, టిప్పర్ డ్రైవర్ అక్కడి నుంచి పారిపోయారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించి, వారిపై దాడికి పాల్పడిన కొర్రపాటి కిషన్‌కుమార్, మేడేపల్లి శ్రీనివాసరావు, పల్లికొండ శ్రీనివాసరావును పోలీస్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. జేసీబీ, టిప్పర్‌లను సీజ్ చేసి చల్లపల్లి తరలించారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు ఇసుక అక్రమ రవాణాపై పోలీసులు వాల్టా చట్టం కింద కేసు నమోదు చేశారు. పోలీస్ కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు మరో కేసు నమోదు చేశారు. అరెస్ట్ చేసిన ముగ్గురు నిందితులను మొవ్వ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించారు. కాగా, రెవెన్యూ, పోలీస్ వారి ఉత్తర్వులను ధిక్కరించి చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు ఈ సందర్భంగా హెచ్చరించారు.

వరద పోటు ట్రాక్టర్లకు చేటు

వరదలకు లంకల్లో 100 ట్రాక్టర్లు మునక



తోట్లవల్లూరు లంకలో వరదకు కొట్టుకుపోయిన ట్రాక్టర్లు



లంకలో వరదకు దెబ్బతిన్న ట్రాక్టర్

ఇంజన్ నిండా పేరుకున్న ఒండ్రుమట్టి

- ఒక్కో ట్రాక్టర్ రిపేరుకు రూ.25 వేలపైనే ఖర్చు
- పంటలు కోల్పోయి దిక్కుతోచని స్థితిలో రైతులు

తోట్లవల్లూరు, సెప్టెంబరు 23 : భారీ వర్షాలు, బుడమేరు వరదలు లంక గ్రామాల రైతులను కోలుకోలేని దెబ్బతీశాయి. పంటలు కోల్పోయి, మోటార్లు పాడైన దిక్కుతోచని స్థితిలో ఉన్న అన్నదాతలను వ్యవసాయంలో ప్రధాన భూమిక పోషించే ట్రాక్టర్లు సైతం వరదకు మునిగి పాడైపోయిన తీరు మరింత ఆర్థికంగా కుంగదీస్తోంది. తోట్లవల్లూరు, తోడేళ్లదిబ్బలంక, కాళింగదిబ్బలంక, పాములలంక, పిల్లివానిలంక, కనిగిరిలంక, ములకలపల్లిలంక, పొట్టిదిబ్బలంకతో పాటు కరకట్ట వెంబడి గ్రామాల రైతుల ట్రాక్టర్లు వరదకు ముందు లంకల్లోనే ఉన్నాయి. కరకట్ట వెంబడి గ్రామాల రైతులు కూడా సాధారణ వరదకు ముందే లంకల్లో ట్రాక్టర్లను ఉంచారు. అయితే ఊహించని రీతిలో భారీ వరద రావడంతో ఎక్కడి ట్రాక్టర్లు అక్కడే మునిగిపోయాయి. నాలుగు రోజుల పాటు వరద నీటిలో ఉండటంతో ఇంజన్ నిండా ఒండ్రుమట్టి పేరుకుపోయిందని రైతులు చెబుతున్నారు. వీటిని బాగు చేయించేందుకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చవుతోందని అంటున్నారు. ప్రభుత్వం కేవలం పంటల నష్టాన్నే చూస్తోందని, లక్షల రూపాయల విలువైన ట్రాక్టర్లకు జరిగిన నష్టాన్ని కూడా అంచనా వేయాలని కోరుతున్నారు.

ట్రాక్టర్ల రిపేర్లకు సాయం ప్రకటించాలి



ట్రాక్టర్ వరదకు ముందు లంక పొలంలో ఉండిపోయింది. వరదల్లో మునిగి పాడైంది. బాగు చేయిస్తే రూ.30 వేలు ఖర్చయింది. పంటలు దెబ్బతిని రూ.లక్షల్లో నష్టపోయా. ఈ ట్రాక్టర్ రిపేరు చేయించేందుకు ఆర్థికంగా ఇబ్బంది పడాల్సి వచ్చింది. ఇంత ఖర్చుతో రిపేరు చేయించినా ఇంజన్ వేడెక్కిపోతోంది. ప్రభుత్వం ట్రాక్టర్ల రిపేర్లకు సహాయం ప్రకటించాలి.

- వీరంకి రమేష్, తోట్లవల్లూరు, రైతు

సీబీఎస్ఈ సిలబస్.. స్టేట్ పరీక్షలు!

వైసీపీ ప్రభుత్వం తీరుతో విద్యార్థుల పాట్లు



6లో



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సృజన, అధికారులు

అర్జీదారులకు సంతృప్తికర పరిష్కారం

» అధికారులకు కలెక్టర్ సృజన సూచన

వన్‌టౌన్, సెప్టెంబరు 23 : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీదారులు ఇచ్చిన దరఖాస్తులను సంతృప్తికరంగా పరిష్కరించాలని అధికారులకు ఎన్టీఆర్‌జిల్లా కలెక్టర్ జి.సృజన సూచించారు. సోమవారం విజయవాడలోని కలెక్టరేట్‌లో జేసీ నిధిమీనా, డీఆర్వో శ్రీనివాసరావు, జిల్లా పౌరసరఫరాల జీఎం జి.వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ రజనీకుమారిలతో కలిసి అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారుల నుద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి గడువులోగా పరిష్కరించాలన్నారు. అర్జీలు ఏస్థాయిలోనూ పెండింగ్ ఉండరాదని, సకాలంలో పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. మొత్తం 111 అర్జీలు అందగా.. రెవెన్యూ 38, పోలీసు 20, ఎంఎయుడి 16, డిఆర్‌డిఎ 5, పంచాయతీరాజ్ 11, సహకార శాఖ 1, ఆరోగ్యశాఖ 2, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం 1, ఉపాధి హామీ 3, పౌరసరఫరాలు 2, హౌసింగ్ 1, విద్య 6, బీసీ వెల్ఫేర్ 1, మత్స్యశాఖ 1, విద్యుత్ శాఖ 1, గనులు 1, ఆర్‌అండ్‌బి 1 చొప్పున వచ్చాయి.

నులిపురుగుల నివారణ దినోత్సవం రేపు

వన్‌టౌన్ : జాతీయ నులిపురుగుల నివారణా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 25వ తేదీన అల్బెండజోల్ మాత్రల పంపిణీ పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సృజన సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో నులిపురుగుల నిర్మూలన దినోత్సవానికి సంబంధించి పోస్టర్, కరపత్రాలను డీఆర్వో వి.శ్రీనివాసరావు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ఈనెల 25వ తేదీన ఒకటి నుంచి 19 సంవత్సరాల లోపు వయసున్న పిల్లలు, కిషోర బాలలకు మాత్రలను పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. ఒకటి నుండి రెండు సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు సగం మాత్ర, ఆ పైన 19 సంవత్సరాల వయస్సు ఉన్నవారికి ఒక మాత్ర తీసుకోవాల్సి ఉంటుందన్నారు. పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, ఐటీఐ, పాలిటెక్నిక్, నర్సింగ్ విద్యార్థులకు ఉచితంగా మాత్రలను పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. డీఎల్ ఏటీవో డాక్టర్ జె.ఉషారాణి, డాక్టర్ బీసీకే నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజలనుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలి శర్మ

మీకోసం అర్జీలు పరిష్కరించండి

» కృష్ణా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కార వేదిక(మీకోసం) కార్యక్రమంలో ప్రజలనుంచి వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని 'మీకోసం' సమావేశపుహాలులో సోమవారం జేసీ గీతాంజలిశర్మ, డీఆర్వో కె.చంద్రశేఖరరావు, కేఆర్‌సీసీ డెప్యూటీ కలెక్టర్ జి.శ్రీదేవితో కలిసి ప్రజలనుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. 160మంది వివిధ సమస్యలపై అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇప్పటివరకు 3,578 అర్జీలు రాగా, వాటిలో 502 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. రెవెన్యూశాఖలో ఏడు, పోలీస్‌శాఖలో ఆరు గడువుదాటిన అర్జీలు ఉన్నాయన్నారు. కోర్టు ధిక్కరణ కేసులు 22ఉన్నాయని, వాటికి సంబంధించిన వకాలత్‌లను వెంటనే దాఖలు చేయాలని అధికారులను ఆదేశించారు. కోర్టుకేసులు, మీకోసం అర్జీలపరిష్కారంపై ప్రతివారం సమీక్ష చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సీపీవో గణేష్, డీఎంఅండ్‌హెచ్‌వో గీతాబాయి అధికారులు పాల్గొన్నారు.

ఎంతకాలం ఉంటానో తెలీదు..!

» నా భూమిని మాజీ మంత్రి జోగి అనుచరులు ఆక్రమిస్తున్నారు

» నాలుగేళ్లుగా కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదు

» మీడియా ఎదుట కేన్సర్ రోగి వేదన



మచిలీపట్నం టౌన్ : కేన్సర్ వ్యాధి నాలుగో స్టేజ్‌లో ఉంది. నాకు వివాహం కాలేదు. పూర్వీకుల ద్వారా వచ్చిన 97 సెంట్ల మాగాణి భూమి ఉంది. నా భూమిని ఆక్రమిస్తున్నారు. దానికి రెవెన్యూ అధికారులు వత్తాసు పలుకుతున్నారు.. అంటూ ముంజులూరు గ్రామానికి చెందిన మహిళ అగస్త్య సంపూర్ణ దీనంగా రోదించింది. కలెక్టరేట్ వద్ద సోమవారం మీడియా ఎదుట సంపూర్ణ తన బాధను వెలిబుచ్చింది. నాలుగేళ్లుగా కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నానని, తన భూమిని మాజీ మంత్రి జోగి రమేశ్ అనుయాయులు ఆక్రమించేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించింది. కేన్సర్ నాలుగో స్టేజ్‌లో ఉన్న తన ఆఖరి కోరికగా కలెక్టర్ సత్వరమే స్పందించి న్యాయం చేయాలని కోరుతోంది.

29న కృష్ణా జిల్లా రచయితల మహాసభలు

అవనిగడ్డ, సెప్టెంబరు 23 : కృష్ణా జిల్లా రచయితల 16వ మహాసభలు ఈ నెల 29న అవనిగడ్డలో జరుగుతాయని సంఘ అధ్యక్ష, కార్యదర్శులు గుత్తికొండ సుబ్బారావు, జీవీ పూర్ణచంద్‌లు సోమవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. 'ప్రకృతి వైపరీత్యాలు-పర్యావరణ పరిరక్షణ-రచయితల పాత్ర' అంశంపై 29వ తేదీన అవనిగడ్డ గాంధీక్షేత్రంలో సదస్సు జరుగుతుందని తెలిపారు. సదస్సులో జలవనరుల నిపుణులు, సాహితీ వేత్తలు టి.శోభనాద్రి, అక్కినేని భవానీ ప్రసాద్, ఎ.వ రప్రసాద్, ఎస్.నరసింహరాజు తదితరులు పాల్గొంటారని తెలిపారు. 2024వ సంవత్సరానికి ఏడుగురు సాహితీ ప్రముఖులకు కృష్ణాజిల్లా రచయితల సంఘం పురస్కారాలు అందజేయనున్నట్టు తెలిపారు. హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ అంబటి శంకర్ నారాయణ ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారని, ఈ కార్యక్రమంలో గన్నముని, విహారి, మండలి బుద్ధప్రసాద్, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌లు పాల్గొంటారని తెలిపారు.

బాలుడి వైద్యానికి సీఎంఆర్ఎఫ్ నిధులు

» ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య హామీ

» సీఎంవోకు లేఖ.. బాలుడి ఆరోగ్యంపై కలెక్టర్ ఆరా

జగ్గయ్యపేట : వరద నీటిలో కాళ్లు నానటం వల్ల బాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్‌తో కాలు పోగొట్టుకున్న ఆర్టీసీ కాలనీకి చెందిన కొత్తా భవదీప్ (12) వైద్యానికి అయ్యే ఖర్చును ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వెచ్చిస్తామని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య తెలిపారు. ఇన్‌ఫెక్షన్‌తో విజయవాడలో చికిత్స పొందుతున్న కొత్తా భవదీప్‌ను శ్రీరాం తాతయ్య సోమవారం పరామర్శించారు. వైద్యానికి అయ్యే ఖర్చును ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఇస్తామని అక్కడికక్కడే సంబంధిత ప్రతాలను పూర్తి చేయించి సీఎంవోకు పంపారు. తాతయ్య సూచన మేరకు కలెక్టర్ బాలాజీ, డీఎంహెచ్‌వో సుహాసినిలు బాలుడి ఆరోగ్యంపై ఆరా తీశారు.

పారామౌంట్ ఇండస్ట్రీస్ అధినేత రూ. లక్ష విరాళం

పారామౌంట్ ఇండస్ట్రీస్ అధినేత వెనిగళ్ల సురేష్‌కుమార్‌రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. రెండో కాలుకు ఇన్‌ఫెక్షన్ సోకి విజయవాడలో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడి కుటుంబసభ్యులకు అందజేస్తామని చెప్పారు. మానవత్వంతో స్పందించిన సురేష్‌కుమార్‌కు బాలుడి తండ్రి నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు.

దేవదాయ శాఖలో బదిలీల జాతర!

» దుర్గగుడి డిప్యూటీ ఈవోగా రత్నబాబు

» ఈఈ రమ బదిలీ

విజయవాడ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : దేవదాయ శాఖలో భారీగా బదిలీలు జరిగాయి. దేవదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలోని ఎం.రత్నరాజును దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ డిప్యూటీ ఈవోగా బదిలీచేశారు. అక్కడ పనిచేస్తున్న జీవీడీఎన్ లీలాకుమార్‌ను పెదకాకాని మల్లేశ్వరస్వామి ఆలయ ఈవోగా, పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థాన ఈవోగా ఉన్న డి.శ్రీరామ వరప్రసాద్‌ను మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థాన ఈవోగా బదిలీ చేశారు. దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ ఈఈగా పనిచేస్తున్న లింగం రమను పెనుగంచిప్రోలులోని తిరుపతమ్మ ఆలయానికి బదిలీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న టి.వైకుంఠరావును దుర్గామల్లేశ్వరస్వామి ఆలయానికి పంపారు. దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ ఏఈగా ఉన్న బి.అశోక్‌ను ద్వారకాతిరుమల ఆలయానికి బదిలీ చేశారు. అన్నవరం సత్యనారాయణస్వామి ఆలయంలో పనిచేస్తున్న పి.రాజబాబును దుర్గామల్లేశ్వరస్వామి ఆలయానికి పంపారు. ద్వారకాతిరుమల ఏఈవోగా ఉన్న ఎం.దుర్గారావును ఇంద్రకీలాద్రికి బదిలీ చేశారు. దుర్గామల్లేశ్వరస్వామి ఏఈవోగా ఉన్న బి.వెంకటరెడ్డిని అన్నవరం దేవస్థానానికి బదిలీ చేశారు. దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న కేవీ దుర్గాప్రసాద్‌ను ద్వారకాతిరుమల దేవస్థానానికి బదిలీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న ఎం.శ్రీనివాసరావును దుర్గామల్లేశ్వరస్వామి ఆలయానికి పంపారు. ఇంద్రకీలాద్రిపై పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ ఎల్ఎల్‌వీ ఎన్‌టీ శర్మ, బి.నాగరాజును పెనుగంచిప్రోలులోని తిరుపతమ్మ ఆలయానికి బదిలీ చేశారు.



అన్నవరంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న బి.త్రినాథ్‌ను దుర్గగుడికి బదిలీ చేశారు. దుర్గగుడిలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ జి.సతీష్‌కుమార్‌ను ద్వారకాతిరుమల దేవస్థానానికి బదిలీ చేశారు. దుర్గగుడిలో జూనియర్ అసిస్టెంట్లు వి.ఉమాశంకర్, టి.లక్ష్మణ్‌కుమార్, టీఎస్ రాంజీని అన్నవరం దేవస్థానానికి బదిలీ చేశారు. అన్నవరంలో పనిచేస్తున్న జీఎల్‌వీఆర్ చౌదరిని దుర్గగుడికి బదిలీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న పలివెల ప్రతాప్‌కుమార్‌ను అన్నవరం దేవస్థానానికి పంపారు. దుర్గగుడిలో ఉన్న జూనియర్ అసిస్టెంట్ పి.శ్రీనివాసరావును ద్వారకాతిరుమలకు, జి.వెంకట అప్పారావు, ఎం.విజయకుమారి, టి.ప్రసాద్‌నాయుడుని అన్నవరం దేవస్థానానికి బదిలీ చేశారు. అన్నవరంలో పనిచేస్తున్న శ్రీరామ రాంబాబు, సీహెచ్ రమేష్‌బాబును దుర్గగుడికి బదిలీ చేశారు. అన్నవరంలో పనిచేస్తున్న గజ్జల ప్రసాద్, కె.నరసింహారావును ఇంద్రకీలాద్రికి పంపారు. ఇక్కడ పనిచేస్తున్న బి.సూరిబాబును అన్నవరానికి పంపారు. తిరుపతమ్మ ఆలయంలో పనిచేస్తున్న ఎస్.రమను దుర్గగుడికి బదిలీ చేశారు. దుర్గగుడిలో ఉన్న డ్రాఫ్ట్స్‌మ్యాన్ ఎన్.రామకృష్ణను ద్వారకాతిరుమలకు పంపారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ఫ్లడ్ లోన్స్

» సీసీఎస్ ద్వారా రుణాలు ఇచ్చేందుకు నిర్ణయం

» వినియోగ రుణాల కింద రూ.25 వేలు నిర్ణయం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉమ్మడి కృష్ణాజిల్లాలో కృష్ణానది, బుడమేరు ముంపు బాధితులైన ఆర్టీసీ ఉద్యోగులకు కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ (సీసీఎస్) తనవంతుగా రుణాలు ఇవ్వాలని నిర్ణయించింది. దీనిపై ఇటీవల సీసీఎస్ పాలకవర్గం చర్చించింది. ఈ క్రమంలో వరదల కారణంగా నష్టపోయిన సిబ్బందికి వినియోగ రుణాలు అందించాలని నిర్ణయించింది. సీసీఎస్ నిర్ణయాన్ని పాలకవర్గ గుర్తింపు సంఘం ఏపీపీటీడీ ఎన్ఎంయూఏ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి సోమవారం అధికారికంగా ప్రకటించారు. ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలో ఆటోనగర్, అవనిగడ్డ, గుడివాడ, గవర్నర్ పేట 1, 2, గన్నవరం, ఇబ్రహీంపట్నం, జగ్గయ్యపేట, మచిలీపట్నం, నూజివీడు, పీఎన్‌బీఎస్, తిరువూరు, విద్యాధరపురం, విజయవాడ, ఉయ్యూరు ఆపరేషనల్ యూనిట్లతోపాటు విజయవాడ జోనల్ వర్క్‌షాప్, విజయవాడ టైర్స్, జడ్ఎం, ఆర్ఎం, జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీ, విద్యాధరపురం హాస్పిటల్, ఎండీ కార్యాలయం వంటి నాన్ ఆపరేషనల్ విభాగాలకు సంబంధించిన ఉద్యోగులు వినియోగరుణాల కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తు ఫారంను ఆయా డిపోల పరిధిలో పాలకవర్గం అందుబాటులోకి తీసుకువచ్చింది. రుణదరఖాస్తు పత్రాలను ఆర్టీసీ ఉద్యోగులు పూర్తి చేసి.. డిపో మేనేజర్ ద్వారా ధృవీకరించిన తర్వాత దానిని సీసీఎస్‌లో సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తు పత్రం అందిన రెండు రోజుల్లోగానే వినియోగ రుణాన్ని నేరుగా సభ్యుల ఖాతాలకు జమ చేస్తారు.

ఫైర్‌స్టేషన్లకు త్వరలో కొత్త భవనాలు!

» అగ్నిమాపక శాఖ అదనపు డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి

» అగ్నిమాపక కేంద్రాల ఆధునీకరణకు రూ. 252 కోట్లు మంజూరు

పామర్రు, సెప్టెంబరు 23 : రాష్ట్ర వ్యాప్తంగా శిథిలావస్థలో ఉన్న అగ్నిమాపక కేంద్రాల నూతన భవనాల నిర్మాణాలకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, దీనిలో భాగంగా సంబంధిత కేంద్రాలకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్టు అగ్నిమాపకశాఖ అడిషనల్ డైరెక్టర్ జి.శ్రీనివాసరెడ్డి అన్నారు. పామర్రు అగ్నిమాపక కేంద్రాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అగ్నిమాపక కేంద్రాల ఆధునీకరణకు ప్రభుత్వం రూ.252 కోట్లను విడుదల చేసినట్టు చెప్పారు. పామర్రుకు రూ1.25 కోట్ల అంచనాలతోపాటు మచిలీపట్నం స్టేషన్ ఆధునీకరణకు రూ2.80 కోట్లతో భవనాల ఆధునీకరణ పనులు త్వరలో ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఇటీవల సంభవించిన వరదల్లో అగ్నిమాపక సిబ్బంది విశేష సేవలందించారని అభినందించారు. బహుళ అంతస్థుల నిర్మాణాలు చేపట్టే యాజమానులు తప్పనిసరిగా ముందస్తుగా నిరభ్యంతర పత్రాలు తీసుకోవాలని, లేనిపక్షంలో చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. అన్నిజిల్లాల్లో అగ్నిమాపక శాఖకు చెందిన భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సిబ్బంది నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. తొలుత అగ్నిమాపక కేంద్రం రికార్డులు, వాహనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సంబంధించి ప్రతిపాదనలు కలెక్టర్‌కు పంపాలని ఆదేశించారు. దీపావళి సందర్భంగా ముందుస్తు చర్యలు తీసుకోనేందుకు ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారి ఏసురత్నం, పామర్రు ఫైర్ అధికారి రాంబాబు సిబ్బంది పాల్గొన్నారు.



స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న అడిషనల్ డీజీ

ఆరోగ్యవంత సమాజం ప్రభుత్వ లక్ష్యం

» మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 23 : ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పాటు చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఆబ్కారీ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నం శారదానగర్‌లో సోమవారం మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతం కార్యక్రమం జరిగింది. గర్భిణులకు పండ్లు, నూతన వస్త్రాలను మంత్రి అందజేశారు. చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా మంత్రి పాల్గొని ప్రసంగించారు. రక్త హీనతను అధిగమిస్తామని, ప్రతి చిన్నారికీ, మహిళకు పోషకాహారం అందించి తీరుతామన్నారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి బండి రామకృష్ణ, మోటమర్రి బాబా ప్రసాద్, బాపిరాజు, పిప్పళ్ల కాంతారావు, సీడీపీవో గ్లోరీ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



గర్భిణులకు సీమంతం కానుకలు అందజేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

ప్రభుత్వ పథకాల అమలు బాధ్యత అంగన్వాడీలదే

» ఎంపీ వల్లభనేని బాలశౌరి

పామర్రు, సెప్టెంబరు 23 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు చేరువ చేసే బాధ్యత అంగన్వాడీ టీచర్లపై ఉందని బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. పెదమద్దాలి గ్రామంలో సోమవారం పామర్రు ఐసీడీఎస్ సీడీపీవో భానుశ్రీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోషకాహార మాసోత్సవాల్లో బాలశౌరి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, పోషన్ అభియాన్ పథకంపట్ల ప్రజల్లో చైతన్యం తీసుకురావలన్నారు. దీనితోపాటు మహిళరక్షణ చట్టాలను వివరించాలన్నారు. ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా మాట్లాడుతూ, గ్రామీణ మహిళల్లో కౌమారదశ బాలికల్లో రక్తహీనత సమస్యను అధిగమించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకుసాగుతుందన్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తొలుత సామూహిక సీమంతాల కార్యక్రమంలో అతివలను ఆశీర్వదించారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి తాడిశెట్టినరేశ్, టీడీపీ నేతలు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, అంగన్వాడి సూపర్‌వైజర్లు, టీచర్లు, మహిళా పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.



అంగన్వాడి పోషకాహారమాసోత్సవాల సభలో మాట్లాడుతున్న ఎంపీ బాలశౌరి



చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న డాక్టర్ కేకేఆర్స్ గౌతమ్ చైర్మన్ అవినాశ్

డాక్టర్ కేకేఆర్స్ గౌతమ్ రూ.25లక్షల విరాళం

గుడివాడ : వరద బాధితుల సహాయార్థం సీఎం రిలీఫ్ ఫండ్‌కుడాక్టర్ కేకేఆర్స్ గౌతమ్ విద్యాసంస్థల చైర్మన్ కొసరాజు అవినాశ్ రూ.25లక్షల విరాళాన్ని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాముతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబుకు సోమవారం క్యాంపు కార్యాలయంలో అందజేశారు. అలాగే గుడివాడ అభివృద్ధికి మరో రూ.20లక్షల చెక్కును ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు అందజేశారు. చంద్రబాబును కలిసిన వారిలో టీడీపీ నేతలు కొల్లిపెదబాబు, చేవూరు జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎం పూర్వ విద్యార్థులు రూ.2లక్షలు..



ఆటోనగర్: ఎన్ఎస్ఎం స్కూల్ ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ సీఎం రిలీఫ్ ఫండ్‌కు విరాళంగా రూ. 2లక్షల చెక్కును సీఎం చంద్రబాబుకు అందజేసినట్టు అసోసియేషన్ కార్యదర్శి గుర్జీత్‌సింగ్ సాహ్ని సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్కూల్ ప్రిన్సిపల్ బ్రదర్ రాయప్పరెడ్డి, ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కె. జయనారాయణ, శ్రీకాంత్, సిహెచ్. ప్రకాష్, టి. అడైకప్పన్ పాల్గొన్నారు.

రేషన్ డీలర్లకు న్యాయం చేయండి

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 23 : గ్రామీణ ప్రాంతంలో 450, పట్టణ ప్రాంతాల్లో 550 రేషన్ బీపీఎల్ కార్డులు కేటాయించాలని కృష్ణాజిల్లా రేషన్ డీలర్ల సంఘ అధ్యక్షుడు ఖాశీం డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జేసీ గీతాంజలి శర్మకు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, గ్రామ పంచాయతీని యూనిట్‌గా, మునిసిపాలిటీలోని వార్డును యూనిట్‌గా తీసుకుని అందరికీ సమానంగా కార్డులు కేటాయించాలన్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు కార్మిక వేతనం చట్టం ప్రకారం రేషన్ డీలర్లకు ఆదాయ వనరులు కల్పించాలన్నారు.

సీబీఎస్ఈ సిలబస్.. స్టేట్ పరీక్షలు!

వైసీపీ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం.. అర్థాంతర ఉత్తర్వులు టెన్త్ విద్యార్థులకు శాపంగా మారింది. ఈ ఏడాది నుంచి సీబీఎస్ఈ సిలబస్ ప్రవేశపెట్టినప్పటికీ పరీక్షా విధానంలో విద్యార్థులకు సరైన అవగాహన కల్పించడంలో విద్యాశాఖ తీరుపై విమర్శలు వస్తున్నాయి. కొత్త విధానంలో పరీక్షలు రాయలేమని విద్యార్థులు తేల్చి చెప్పడంతో ఈసారి కూడా పాత పద్ధతిలోనే స్టేట్ పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు.

» వైసీపీ ప్రభుత్వ తీరుతో విద్యార్థుల పాట్లు

» అర్థంతరంగా సీబీఎస్ఈ సిలబస్..

» పరీక్షలపై కొరవడిన అవగాహన

» పరీక్ష రాయలేమంటున్న విద్యార్థులు

» పాత విధానంలోనే పది పరీక్షలు



మచిలీపట్నం టౌన్ : ఈ ఏడాది నుంచి పదో తరగతి విద్యార్థులకు సీబీఎస్ఈ సిలబస్ అమల్లోకి వచ్చింది. సిలబస్ మేరకు పబ్లిక్ పరీక్షల్లో ఐదు ప్రశ్నాపత్రాల్లో పరీక్షలు నిర్వహించి విద్యాశాఖ విద్యార్థుల నుంచి అభిప్రాయ సేకరణ చేయగా కొత్త విధానంలో పరీక్షలు రాయలేమని తేల్చి చెప్పారు. సీబీఎస్ఈ సిలబస్‌లో ఐదు ప్రశ్నాపత్రాలు మాత్రమే ఉండగా.. స్టేట్ సిలబస్ విధానంలో ఏడు ప్రశ్నాపత్రాలు ఉంటాయి. తెలుగు, హిందీ, ఇంగ్లీషు, సైన్స్(రెండు), లెక్కలు, సోషల్ పేపర్లు ఉంటాయి. ఈ ఏడు ప్రశ్నాపత్రాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాల్సి ఉంది.

● పైలెట్ ప్రాజెక్టుగా రాష్ట్రంలో 1000 పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్‌ను ప్రవేశపెట్టారు. సిలబస్, పాఠ్యపుస్తకాలు సీబీఎస్ఈలో ఉన్నప్పటికీ ఈ ఏడాది టెన్త్ విద్యార్థులకు స్టేట్ తరహాలో పరీక్షలు నిర్వహించేందుకు రంగం సిద్ధం చేశారు. కృష్ణాజిల్లాలో 9, ఎన్టీఆర్ జిల్లాలో 27పాఠశాలల్లో ఈ సిలబస్‌ను ప్రవేశపెట్టారు. తర్వాత రాష్ట్రమంతా సీబీఎస్ఈ సిలబస్‌ను ప్రవేశపెట్టినప్పటికీ విద్యార్థుల్లో సరైన అవగాహన కల్పించలేకపోయారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులకు ఏడు ప్రశ్నాపత్రాలపై అవగాహన కల్పించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో విద్యాశాఖాధికారులను 'ఆంధ్రజ్యోతి' పలకరించింది.


ప్రశ్నాపత్రాలపై అవగాహన కల్పిస్తున్నాం : డీఈవో



పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులకు ఇప్పటి నుంచే ప్రశ్నాపత్రాలపై అవగాహన కల్పిస్తున్నాం. కొందరు తల్లిదండ్రులకు సీబీఎస్ఈ సిలబస్‌లో ఐదు ప్రశ్నాపత్రాలు ఉంటాయనే అపోహ ఉంది. ఆ అపోహ తొలగించేందుకు ప్రయత్నం చేస్తున్నాం. ఇందుకు ప్రధానోపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేయాలనుకుంటున్నాం.

స్టేట్ విధానంలోనే పరీక్షలు

డి.దేవానందరెడ్డి, విద్యాశాఖ డైరెక్టర్



పదో తరగతి విద్యార్థుల సిలబస్, పాఠ్యపుస్తకాలు సీబీఎస్ఈలో ఉన్నప్పటికీ ప్రశ్నాపత్రాలు స్టేట్ తరహాలో ఈ ఏడాది ఇస్తాం. ముందుగా సీబీఎస్ఈ విధానంలో పరీక్షలు నిర్వహించాలనుకున్నా.. విద్యార్థులు సీబీఎస్ఈ విధానంలో రాసేందుకు ఇష్టపడటం లేదని సర్వేలో తేలింది. దీనివల్ల పాత విధానంలోనే ఏడు ప్రశ్నాపత్రాలు ఇస్తాం. మోడల్ ప్రశ్నాపత్రాలు వెబ్‌సైట్‌లో ఉంచాం. వీటిపై డీఈవో, డీవైఈవో, ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించవలసి ఉంది.

న్యూస్ బాక్స్

డీపీవో బాధ్యతల స్వీకారం



మచిలీపట్నం, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి) : జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో)గా జె.అరుణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆమె కృష్ణా డీపీవోగా నియమితులయ్యారు. ముందుగా ఆమె కలెక్టర్ బాలాజీని మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఉద్యోగులు, అధికారులతో సమన్వయం చేసుకుని పంచాయతీరాజ్ విభాగంలో మంచి పరిపాలనను అందిస్తానని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.

27న జూనియర్ షూటింగ్ బాల్ జిల్లా జట్ల ఎంపిక

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 23 : కృష్ణా జిల్లా షూటింగ్ బాల్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 27న విజయవాడ ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాలలో రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జూనియర్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్టు సంఘం అధ్యక్ష కార్యదర్శులు అట్లూరి రాజశేఖర్, గోగులమూడి విజయ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు అక్టోబర్ 6, 7 తేదీల్లో జరగనున్న ఏడవ రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఆధార్, జనన ధృవపత్రాలతో కళాశాలలోని వాలీబాల్ క్రీడా మైదానంలో రిపోర్టు చేయాలని విజ్ఞప్తి చేశారు.



విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

అంతర్జాతీయ ఆర్చరీ పోటీలకు వీఆర్ సిద్ధార్థ కళాశాల విద్యార్థి

పెనమలూరు : ఈనెల 26నుంచి వచ్చే నెల నాలుగు వరకు చైనీస్ తైపేలో జరగనున్న అంతర్జాతీయ ఆర్చరీ పోటీలకు వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి పెండ్యాల త్రినాద్‌చౌదరి ఎంపికైనట్టు కళాశాల పీడీ పోతిన రఘు తెలిపారు. విద్యార్థిని వీసీ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ రత్నప్రసాద్, రిజిస్ట్రార్ రవిచంద్, డీన్ పాండురంగారావులు అభినందించారు.

హ్యూమన్ రైట్స్ కృష్ణాజిల్లా అధ్యక్షుడిగా వక్కపాటి శివప్రసాద్

మచిలీపట్నం టౌన్ : హ్యూమన్‌రైట్స్ కృష్ణాజిల్లా అధ్యక్షుడిగా వక్కపాటి శివప్రసాద్‌ను నియమిస్తూ సోమవారం జాతీయ అధ్యక్షురాలు అమ్మిరెడ్డి రజని నియామక పత్రం అందజేశారు. గాంధీనగరంలో కార్యాలయం వద్ద శివప్రసాద్‌కు నియామక పత్రం ఇస్తూ మానవ హక్కులను పరిరక్షించాలని కోరారు.

క్రైం కార్నర్

వివాహిత హత్యకేసు..


నిందితుడికి జీవిత ఖైదు

మచిలీపట్నం/వీరులపాడు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : వివాహితపై రోకలిబండతో దాడిచేసి హతమార్చిన అనంతరం ఆమెపై లైంగికదాడి చేసిన నిందితుడిపై నేరం రుజువుకావడంతో జీవితఖైదు, రూ.9వేలు జరిమానా విధిస్తూ 9వ అదనపు జిల్లాసెషన్స్ జడ్జి ఎస్.సుజాత సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వీరులపాడుగ్రామానికి చెందిన వివాహిత భర్తతో గొడవ పడి, తన సోదరి ఇంటిలో వేరుగా ఉంటోంది. అదే గ్రామానికి చెందిన పొట్టిపోగు యోసేబు 14 ఏప్రిల్ 2023వ తేదీ రాత్రి ఒంటరిగా ఉన్న మహిళపై రోకలిబండతో దాడి చేయడమేగాక మరణించిన ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఆమె సెల్‌ఫోన్, బంగారువస్తువులు తీసుకుని పారిపోయాడు. మృతురాలి సోదరి ఫిర్యాదు మేరకు పోలీసులు హత్య, లైంగికదాడి, దొంగతనం కేసునమోదు చేశారు. కేసులో 21మంది సాక్షులను విచారించగా, నిందితుడిపై నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

భార్యను వేధించిన కేసులో ..

భార్యను వేధించిన కేసులో భర్తపై నేరం రుజువుకావడంతో 10నెలల జైలుశిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి దేవిసాయిశ్రీవాణి సోమవారం తీర్పుచెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. మచిలీపట్నం మల్కాపట్నంకు చెందిన పి.మధుమోహనప్రసాద్‌కు కృపావాణికి 11ఆగస్టు 2006వ తేదీన వివాహం జరిగింది. కొంతకాలంపాటు సక్రమంగానే ఉన్న ప్రసాద్ అనంతరం తన భార్యను వేధిస్తున్నాడు. దీంతో భర్త వేధింపులు భరించలేని కృపావాణి మచిలీపట్నం పోలీస్‌స్టేషన్‌లో 14జూలై 2018వ తేదీన ఫిర్యాదు చేసింది. కేసులో ప్రాసిక్యూషన్ తరపున ఎనిమిది మంది సాక్షులను విచారించారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

కిడ్నీ వ్యాధితో ఒకరి మృతి



గంపలగూడెం: కిడ్నీ వ్యాధితో బాధపడుతూ వ్యక్తి సోమవారం మృతి చెందాడు. అనుముల్లంక గ్రామానికి చెందిన నక్కనబోయిన వెంకటేశ్వర్లు (55) కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. డయాలసిస్ చేయించుకుంటున్న అతను విజయవాడలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. గత రెండు నెలల వ్యవధిలో అనుముల్లంకలో ఐదుగురు కిడ్నీ రోగులు మృతి చెందారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 555

ఎండీయూ వ్యవస్థను రద్దు చేయాలి: దివి

గన్నవరం, సెప్టెంబరు 23 : రాష్ట్రంలో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎండీయూ వ్యవస్థను రద్దు చేయాలని రేషన్ డీలర్స్ సంక్షేమ సమైక్య జిల్లా అధ్యక్షుడు దివి లీలామాధవరావు డిమాండ్ చేశారు. సోమవారం సమైక్య గౌరవ అధ్యక్షులు కస్తూరి అప్పారావుతో కలసి విలేకరులతో మాట్లాడుతూ, ప్రభుత్వం అనుసరించిన విధానాల వల్ల రేషన్ డీలర్లకు తీరని అన్యాయం జరిగిందన్నారు. వాహనాలు పెట్టడం వల్ల డీలర్లకు ప్రాధాన్యత లేకుండా పోయిందని, అసలు డీలర్ వ్యవస్థ లేకుండా చేయాలని చూస్తే గట్టిగా ఒత్తిడి చేసినట్లు తెలిపారు. పోరాటాల కారణంగానే డీలర్ల వ్యవస్థ నిలబడిందన్నారు. గత ప్రభుత్వం రేషన్ డీలర్లకు కమీషన్‌తో పాటు గౌరవ వేతనం చెల్లించాలన్నారు. సమస్యలపై చర్చించడానికి ఈ నెల 25న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్రస్థాయిలో సమావేశం జరుగుతుందని తెలిపారు.

తాడిగడప మునిసిపల్ కమిషనర్‌గా

భవానీ ప్రసాద్ బాధ్యతల స్వీకరణ



పెనమలూరు, సెప్టెంబరు 23 : తాడిగడప మునిసిపాలిటీ నూతన కమిషనర్‌గా పీ భవానీప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన జంగారెడ్డిగూడెంలో పనిచేశారు. భవానీ ప్రసాద్‌ను ప్రభుత్వం గత కమిషనర్ వెంకటేశ్వరరావు స్థానంలో నియమించింది.
● ఏపీ సీఆర్డీఏలో పని చేస్తున్న రంగప్రసాద్‌ను తాడిగడప మునిసిపాలిటీలో అసిస్టెంట్ సిటీప్లానర్‌గానూ, విజయవాడ వీఎంసీ టౌన్‌ప్లానింగ్‌లో పనిచేస్తున్న కే శ్రీనివాసరావు, కే అరుణలను తాడిగడప మునిసిపాలిటీలో టీపీఎస్‌లుగా ప్రభుత్వం నియమించింది.

వైభవంగా వినాయక నిమజ్జనం


వేలంలో పాడిన లడ్డూతో కమిటీ సభ్యులు

పెనమలూరు, సెప్టెంబరు 23 : కానూరు వరసిద్ధి వినాయకస్వామి నిమజ్జన కార్యక్రమం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు స్వామివారికి పూజలు నిర్వహించి మొక్కులను తీర్చుకొన్నారు. అనంతరం స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించి, నిమజ్జనం చేశారు. వినాయక లడ్డూకు నిర్వహించిన వేలంలో అంగిరేకుల సీతారామయ్య, మసిముక్కు వీరాస్వామిలు రూ. 2,60,333కు దక్కించుకున్నారు.

నేటి నుంచి ఆటల పోటీలు

ఉయ్యూరు, సెప్టెంబరు 23 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉయ్యూరు మండలస్థాయి అండర్-14, అండర్ - 17 బాలబాలికల ఆటల పోటీలు, ఎంపికలు స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నేటి నుంచి నిర్వహిస్తున్నట్టు మండల స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ జీవీ రమణ తెలిపారు. మంగళవారం అండర్-14, అండర్ -17 బాలుర ఎంపిక, బుధవారం బాలికల ఎంపికలు కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, యోగాసనాలు, అథ్లెటిక్స్‌లలో జరుగుతాయని వివరించారు. ఎంపికలు ఎంఈవోలు పద్మారాణి, సుధారాణి, హెచ్‌ఎం జ్యోత్స్నదేవి పర్యవేక్షణలో జరుగుతాయని తెలిపారు.

దివ్యాంగుల్లో ఆత్మాభిమానం పెంచాలి


విశ్రాంతి మందిరాన్ని ప్రారంభిస్తున్న పుట్టగుంట

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 23 : దివ్యాంగులను ప్రతి ఒక్కరూ అక్కున చేర్చుకుంటే వారిలో కూడా ఆత్మాభిమానం పెరుగుతుందని పుట్టగుంట వెంకట సతీష్ కుమార్ హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ పుట్టగుంట సతీష్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక ఏలూరు రోడ్డులోని ఆశాజ్యోతి మానసిక దివ్యాంగుల ఆశ్రమ పాఠశాల్లో తన సొంత నిధులతో నిర్మించిన విశ్రాంతి మందిరాన్ని పుట్టగుంట ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు ఫలహారాలు పంపిణీ చేశారు. పాఠశాల నిర్వహిస్తున్న గోశాలను సందర్శించి వారి అభిరుచిని అభినందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ నాయకులు నందిగం స్వామి, తాడి రంగారావు, అక్కినేని ఫణి తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద మృతిపై కేసు

గన్నవరం, సెప్టెంబరు 23 : మండలంలోని వీరపనేనిగూడెం గ్రామానికి చెందిన షేక్ బాజీ (38) అనుమానాస్పద స్థితిలో పోలవరం కాలువలో పడి మృతి చెందాడు. ఆత్కూరు ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. బాజీ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసై అప్పులు పాలయ్యాడు. ఆటో వాయిదాలు కూడా సరిగ్గా చెల్లించక పోవటంతో ఫైనాన్స్ కంపెనీ ఆటోను స్వాధీనం చేసుకుంది. శనివారం మద్యం బాగా సేవించి ఇంటికి రావటంతో ఏ పనికి వెళ్లకుండా ఇలా తాగేసి తిరిగితే కుటుంబం ఎలా గడవాలని భార్య నిలదీసింది. ఆమెపై గొడవ పడి అర్ధరాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. సోమవారం వరకూ ఇంటికి రాకపోవటంతో చుట్టు పక్కల వెతుకుతుండగా గ్రామ శివారులో గల పోలవరం కాలువలో శవమై కనిపించాడు. అతని భార్య షేక్ కరీమున్నిసా ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు. మృతుడికి భార్యతో పాటు కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ముగిసిన షటిల్ టోర్నమెంట్

గన్నవరం, సెప్టెంబరు 23 : గన్నవరం కేవీఆర్ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న ఉమ్మడి కృష్ణాజిల్లా పురుషుల షటిల్ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. 45 ఏళ్లపై బడిన విభాగంలో మధురానగర్ జట్టు విజేతగా నిలవగా నూజివీడు జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. మూడవ స్థానంలో గన్నవరం జట్టు, నాల్గువ స్థానంలో హనుమాన్‌జంక్షన్ జట్టు నిలిచాయి. 45 ఏళ్లలోపు విభాగంలో నందిగామ జట్టు విజేతగా, విజయవాడ జట్టు రన్నర్‌గా, మధురానగర్, గన్నవరం జట్లు మూడు, నాలుగు స్థానాల్లో నిలిచాయి. అనంతరం రెండు విభాగాల్లో వరుసగా నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లకు ఏఎంసీ మాజీ చైర్మన్ పొట్లూరి బసవరావు, కేవీఆర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కేవీ రమణ, కార్యదర్శి కేవీఆర్ కిషోర్ బహుమతులు అందజేశారు.


బహుమతులు అందజేస్తున్న కేవీ రమణ


కానూరులో జరిగిన అభివృద్ధిని వివరిస్తున్న వెలగపూడి శంకరబాబు


గన్నవరంలో..

సంక్షేమాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

వీరవల్లి, బండారుగూడెంలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



బండారుగూడెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 23 : సంక్షేమం, అభివృద్ధిని వేగవంతం చేస్తూ వంద రోజులు పాలనలో ఇది మంచి ప్రభుత్వం అంటూ ప్రజల మన్ననలు పొందడం ప్రభుత్వ ఘనతని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. వీరవల్లి, బండారుగూడెం గ్రామాల్లో సోమవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన పర్యటించారు. గ్రామాల్లో ప్రజావేదిక నిర్వహించి, ప్రజలతో ముఖాముఖి నిర్వహించారు. వీరవల్లిలో కళ్యాణ మండపం నిర్మించేందుకు ఎంపీ బాలశౌరితో మాట్లాడతానని, చలమలశెట్టి రమేష్‌తో కలిసి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వీరవల్లి సర్పంచ్ పిల్లా అనిత, బండారుగూడెం సర్పంచ్ వడ్లమూడి అమ్మాజీ, ఎంపీటీసీ అమృతపల్లి సూర్య నారాయణ, గ్రామ కమిటీ అధ్యక్షుడు లంక సురేంద్ర మోహన బెనర్జీ, గుండపనేని ఉమావరప్రసాద్, ఆళ్ల గోపాలకృష్ణ, వేములపల్లి శ్రీనివాసరావు, చలమలశెట్టి రమేష్‌బాబు, లంక అజయ్, పుట్టా సురేష్, బచ్చుల బోస్, మూల్పూరి సాయి కళ్యాణి, మండాది రవీంద్ర, జోజిప్రతాప్, మేడేపల్లి రమ పాల్గొన్నారు.
● రామన్నగూడెంలో టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి చలసాని శ్రీనివాస్, సర్పంచ్ రెడ్డి వీరాంజనేయులు ఆధ్వర్యంలో సోమవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించి ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాసరావు, వడ్లమూడి నాని, ముద్దరబోయిన దాసు, జూపూడి బాలకృష్ణ, జువ్వలపూడి ఏసుపాదం పాల్గొన్నారు.


రామన్నగూడెంలో..

కానూరులో..
పెనమలూరు : రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి చంద్రబాబుకు రెండు కళ్లని టీడీపీ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు పేర్కొన్నారు. సోమవారం కానూరులో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన స్థానిక నాయకులతో కలిసి పాల్గొని ప్రజలతో మాట్లాడారు. వంద రోజుల పాలనలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో షేక్ రఫీ, ఇమాం, బచ్చన్, రియాజ్ తదితరులు ఉన్నారు.

కూటమి ప్రభుత్వంతో మేలు
గన్నవరం : కూటమి ప్రభుత్వంతోనే ప్రజలకు మేలు జరుగుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక పట్టణంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి వందరోజులు అయిన సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్‌లను ఇంటింటికి వెళ్లి అంటించారు. ఈ సందర్భంగా జాస్తి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. నాయకులు జాస్తి శ్రీధర్, జూపల్లి సురేష్, ఆరుమళ్ల కృష్ణారెడ్డి, చిక్కవరపు నాగమణి, బుస్సే సరితాదేవి, గంజి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు. చిక్కవరంలో టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి వంద రోజుల పాలనను వివరిస్తూ స్టిక్కర్‌లను అంటించారు. రేపూరి శివరామకృష్ణ, చిట్టినేని జోజిబాబు, చిట్టినేని శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జనాన్ని దోచుకున్న జగన్
కంకిపాడు : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జనాన్ని జగన్ దోచుకున్నారని టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి పులి శ్రీనివాసరావు అన్నారు. తెలుగు యువత జిల్లా కార్యదర్శి బొర్రా వెంకట్‌తో కలిసి సోమవారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పులి శ్రీనివాసరావు మాట్లాడుతూ, గత ప్రభుత్వం చూపించిన విధ్వంసకర పాలనకు విసిగిపోయిన ప్రజలు ఆ పార్టీకి 11 సీట్లు మాత్రమే ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే జనరంజక పాలన అంటే ఎంటో సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ చేసి చూపించారని కొనియాడారు.


కంకిపాడులో..

అంతర్‌జిల్లా అథ్లెటిక్స్‌కు ఉయ్యూరు విద్యార్థులు


పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఉయ్యూరు, సెప్టెంబరు 23 : అంతర్‌జిల్లా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు ఏజీ అండ్ ఎస్‌జీఎస్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్టు కళాశాల డైరెక్టర్ వినయ్‌కుమార్ తెలిపారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ విజయవాడ పీవీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన అథ్లెటిక్స్ సెలక్షన్స్ ట్రయల్స్‌లో 16 ఏళ్ల బాలుర విభాగంలో డి.అఖిల్‌బాబు 600 మీటర్ల పరుగు పోటీల్లో ప్రథమ, వి.అఖిల్‌దీప్ షాట్‌పుట్‌లో ద్వితీయస్థానం, 20 ఏళ్ల విభాగంలో 400 మీటర్లు, 500 మీటర్ల పరుగుపందెంలో కె.వాసుదేవరావు ప్రథమస్థానం సాధించాడు. ప్రిన్సిపాల్ బుచ్చిరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ పి. చంద్రబాబు విద్యార్థులను అభినందించారు.

జంక్షన్‌లో ముస్లింల భారీ ర్యాలీ



హనుమాన్ జంక్షన్, సెప్టెంబరు 23 : మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకొని మదీనా మసీదు నౌజవాన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ముస్లింలు మహమ్మద్ ప్రవక్తను స్మరిస్తూ జంక్షన్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏలూరు రోడ్డులో మసీదు ఇమామ్ షఫీకుర్ రహెమాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమాన్ని నౌజవాన్ కమిటీ అధ్యక్షకార్యదర్శులు షేక్ మౌలాలి, షేక్ మిర్జావలి, కమిటీ సభ్యులు షేక్ మిరా, అబ్దుల్లా, షఫీ, రహెమాన్, ఆశ్రఫ్ పర్యవేక్షించారు.

వర్గీకరణ ఫలాలు నిరుపేదలకు అందాలి


సమావేశంలో మాట్లాడుతున్న మంద వేణు

ఉంగుటూరు, సెప్టెంబరు 23 : సుప్రీంకోర్టు తీర్పు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా రావటం శుభపరిణామమని, వర్గీకరణ ఫలాలు సమాజంలో అట్టడుగున వున్న నిరుపేదల బిడ్డలకు అందిననాడే విజయోత్సవాలు జరుపుకోవాలని కృష్ణాజిల్లా ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మంద వేణు మాదిగ అన్నారు. మండలంలోని తేలప్రోలులో సోమవారం బాపులపాడు, ఉంగుటూరు మండలాల ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ గన్నవరం నియోజకవర్గ ఇన్‌చార్జి ఎర్రగుంట వినోద్, పులపాక పాస్కల్, జంపన పాపారావు, జంపన బుజ్జి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

ఉయ్యూరు : హామీలు అమలు జరుపుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని 9వ వార్డు కౌన్సిలర్ ఊర శ్రీవాణి అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 7. 9 వార్డు సచివాలయంలో సోమవారం కమిషనర్ వెంకటేశ్వరరావు అధ్యక్షతన స్థానికులు, పథకాల లబ్ధిదారుల సమావేశం నిర్వహించారు.

కోడిపందేలపై పోలీసుల దాడి

పెనమలూరు, సెప్టెంబరు 23 : వణుకూరు పేదల కాలనీలో కోడిపందేలపై పోలీసులు దాడి చేసి 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. సోమవారం పోలీసులకు అందిన సమాచారంతో పెనమలూరు ఎస్సై రాజేష్ తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. కేసులు నమోదు చేసినట్టు సీఐ వెంకటరమణ తెలిపారు.

విద్యార్థుల సాయం అభినందనీయం

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : విపత్కర పరిస్థితుల్లో ఉన్న ప్రజలకు సహాయం అందించేందుకు విద్యార్థులు ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. వీరవల్లి వాణీవిద్యానికేతన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గన్నవరం నియోజకవర్గ పరిధిలోని ఏపీ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ విద్యార్థులు సమీకరించిన రూ. 8, 65, 616 లక్షల విరాళం చెక్కును ఎమ్మెల్యే యార్లగడ్డకు అందజేశారు. ఈ కార్యక్రమం లో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌బాబు, అప్సా(ఏపీ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్) చైర్మన్ గొల్లపూడి మోహనరావు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, గన్నవరం డివిజన్ అధ్యక్షుడు దుట్టా శివన్నారాయణ, రామకృష్ణ, నందిగం రవికుమార్, కె.ఎస్.ఎస్. ముఖర్జీ తదితరులు పాల్గొన్నారు.
● వరద బాధితులను ఆదుకునేందుకు సీఎం రిలీఫ్ ఫండ్‌కి రేమల్లె హైస్కూల్ విద్యార్థులు తమ వంతు విరాళం అందజేశారు. రేమల్లె హైస్కూల్ హెచ్‌ఎం లూథర్‌పాల్ ఆధ్వర్యంలో విద్యార్థులు సమీకరించిన రూ. 25,205 చెక్కును సోమవారం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు అందజేశారు. ఈ కార్యక్ర మంలో దారపురెడ్డి భాస్కరరావు, వెలమర్తి రవిబాబు, పరస రాజేష్, తదితర ఉపాధ్యాయులు, కలపాల రాధాకృష్ణ, యనమదల శ్రీనివాసరావు, యనమదల సుధాకర్, ఏఎంసీ చైర్మన్ సొదిమెళ్ల శ్యామ్ పాల్గొన్నారు.

తిరుమల పవిత్రతను కాపాడాలి

జనసేన తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు తాతపూడి గణేష్

పెనమలూరు, సెప్టెంబరు 23 : గత వైసీపీ పాలనలో తిరుమల పవిత్రతను మంటగలిపి, భక్తుల మనోభావాలను దెబ్బతీసిన నిందితులను కఠినంగా శిక్షించి, తిరుమల పవిత్రతను కాపాడాలని జనసేన తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు తాతపూడి గణేష్ డిమాండ్ చేశారు. సోమవారం తాడిగడప జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత 50 ఏళ్లుగా తిరుమలకు నెయ్యి సరఫరా చేస్తున్న కర్నాటకకు చెందిన నందిని సంస్థను పక్కన పెట్టి, తమిళనాడుకు చెందిన సంస్థకు టెండర్ ఇవ్వడంపై లోతైన విచారణ జరపాలని కోరారు. కిలో నెయ్యిని రూ. 350కు సరఫరా చేయటంలో మతలబు ఏంటో తేల్చాలని కోరారు. తిరుమల పవిత్రతపై తమ నేత పవన్‌కల్యాణ్ చేస్తున్న ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా తాముకూడా స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయంలో దీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గోళ్ల శ్రీనివాసరావు, వడ్డీ జీవా, గంధం సురేష్, తిరుమలశెట్టి సుధీర్, ఉల్లి సుబ్బారావు, శ్రీనివాస్, కరిమికొండ బాబు, చాంతాటి రాము, అడపా శ్రీను, సుహాసిని, నాగమ్మ, తిరుపతమ్మ, అఖిల్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

మానికొండ సర్పంచ్ టీడీపీలో చేరిక



ఉంగుటూరు, సెప్టెంబరు 23 : మానికొండ సర్పంచ్ నిమ్మకూరి స్వర్ణలత, శ్రీనివాసరావు దంపతులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వందరోజులు పూర్తయిన సందర్భంగా ఆదివారం సాయంత్రం మానికొండలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ దంపతులకు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ స్వర్ణలత మాట్లాడుతూ, గ్రామంలో కూటమి నాయకులు, కార్యకర్తలందరినీ కలుపుకుంటూ పార్టీ బలోపేతానికి పాటుపడతానన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి, స్థానిక నాయకులు ఆరికట్ల రవికుమార్, బెజవాడ నాగేశ్వరరావు, యడ్లపల్లి సాయిబాబు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.2 లక్షల విరాళం



పెనమలూరు, సెప్టెంబరు 23 : ఆంధ్రప్రదేశ్ ఉపాధి శిక్షణాధికారుల సంఘం సోమవారం సీఎం రిలీఫ్ ఫండు పేరిట మంత్రి లోకేష్‌కు రూ. రెండు లక్షల చెక్కును అందించారు. సంస్థ అధ్యక్షుడు డాక్టర్ వీరభద్రారెడ్డి, కార్యదర్శి డాక్టర్ ఎన్‌వీ సురేంద్రబాబు లోకేష్‌కు చెక్కును సీఎం నివాసంలో అందించారు.

తిరుపతమ్మ ఆలయ అభివృద్ధికి ..


జాస్తి శ్రీధర్‌కు విరాళం అందజేస్తున్న దాతలు

గన్నవరం, సెప్టెంబరు 23 : పాత గన్నవరంలోని లక్ష్మీ తిరుపతమ్మ ఆలయం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న తిరుపతమ్మ సేవా సదన్ నిర్మాణానికి పట్టణానికి చెందిన జాస్తి కనకారావు, కళ్యాణి దంపతులు రూ.లక్ష విరాళం ఇచ్చారు. ఈ మేరకు సోమవారం ఆలయ కమిటీ అధ్యక్షులు జాస్తి శ్రీధర్‌కు నగదును అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ, ఆలయ కార్యక్రమాల నిర్వాహణ నిమిత్తం తిరుపతమ్మ సేవా సదన్‌ను నిర్మిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు జాస్తి ఫణిశేఖర్, పోట్ల శివలీల, పాతూరి దుర్గారాణి, కాసన్నేని నాని, జాస్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సనాతనధర్మాన్ని కాపాడుకోవాలి


డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దీక్షకు సంఘీభావంగా విష్ణాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

కంకిపాడు, సెప్టెంబరు 23 : సనాతనధర్మాన్ని కాపాడుకునేందుకు హిందువులు నడుం బిగించాలని టీడీపీ, జనసేన సమన్వయకర్త ముప్పా రాజా అన్నారు. శ్రీవారి లడ్డూను వైసీపీ ప్రభుత్వం అపవిత్రం చేసిందంటూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేపట్టిన దీక్షకు మద్దతుగా సోమవారం విష్ణాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక జనసేన పార్టీ నాయకులు బోయిన నాగరాజు, అడపా నాగశ్రీ, రోహిణి కుమారి, గుడివాడ మల్లిబాబు, పచ్చిపాల శేఖర్, సుంకర శివ, తెలుగుయువత జిల్లా కార్యదర్శి బొర్రా వెంకట్ పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.555



కొండాలమ్మ హుండీ ఆదాయం రూ.26.92 లక్షలు

గుడ్లవల్లేరు : వేమవరం కొండాలమ్మకు భక్తులు సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించారు. 65 రోజులకు రూ.26.92 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో కానూరి సురేష్ బాబు తెలిపారు. తనిఖీ అధికారి కగ్గా శ్రీనివాసరావు, సిబ్బంది పర్యవేక్షించారు.

ఈవోగా కొండలరావు



కొండాలమ్మ దేవస్థానం ఈవోగా ఎ.కొండలరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. మద్ది అంజనేయస్వామి ఆలయం ఈవోగా పనిచేస్తూ బదిలీపై వచ్చారు. కానూరి సురేష్ బాబు ఎన్టీఆర్ జిల్లా వేదాద్రి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ఈవోగా నియమితులయ్యారు.



పోలాటితిప్పలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర



కేకు కట్ చేసి ఎమ్మెల్యే కుమార్‌రాజాకు పెడుతున్న ఎంపీ బాలశౌరి



గుడ్లవల్లేరులో వెనిగండ్లను సత్కరిస్తున్న టీడీపీ నేతలు

మోడల్ నియోజకవర్గంగా బందరు

● గుండేరు, ఉప్పుటేరులపై రూ.14 కోట్లతో వంతెన నిర్మాణానికి టెండర్లు

● కోన ప్రజల దాహార్తి తీర్చేందుకు యాదరలో 70 ఎకరాల చెరువు : రవీంద్ర

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 23 : బందరును అభివృద్ధిలో మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం పోలాటితిప్ప, పల్లెతుమ్మలపాలెం, కోన గ్రామాల్లో మంత్రి కొల్లు రవీంద్ర విస్తృతంగా పర్యటించారు. కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, టీడీపీ ప్రభుత్వంపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. దీపావళికి ఉచిత గ్యాస్ సిలెండర్లు అందిస్తామన్నారు. తల్లికి వందనం పథకం అందించడంపై సర్వేజరుగుతుందన్నారు. పల్లెతుమ్మలపాలెం వద్ద గుండేరు, నడిమేరు, ఉప్పుటేరులపై రూ. 14 కోట్లతో వం తెన నిర్మించేందుకు టెండర్ల ప్రక్రియ పూర్తయిందన్నారు. కోన, పోలాటితిప్ప, పల్లెతుమ్మలపాలెం గ్రామ ప్రజల తాగునీటి సమస్య తీర్చేందుకు పెదయాదరలో 70 ఎకరాల విస్తీర్ణంలో చెరువు తవ్విస్తున్నామన్నారు. ఫిష్‌ల్యాండ్ మా ర్కెట్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు స్థలం ఇచ్చి ఇల్లు కట్టుకునేందుకు రూ. 4 లక్షలు అందిస్తామన్నారు. కృష్ణా యూనివర్శిటీ రోడ్డును త్వరలో నిర్మిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ లంకే నారాయణ ప్రసాద్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండి రామకృష్ణ, తహసీల్దార్ మధుసూదనరావు, కల్లూరి సురేష్, సర్పంచ్‌లు మోకా నాగరాజు, వడుగు నాగరాజు, మంగరాజు, శ్రీనివాసరావు, వీరంకి మునీశ్వరరావు పాల్గొన్నారు.



వాడవాడలా ఇది మంచి ప్రభుత్వం

మచిలీపట్నం టౌన్ : ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాలు నగరంలోని ఎనిమిదో డివిజన్, మూడో డివిజన్, మేకావారిపాలెం, పొట్లపాలెం గ్రామాల్లో జరిగాయి. టీడీపీ, జనసేన నాయకులతో పాటు అధికారులు రాష్ట్ర ప్రభుత్వం వంద రోజుల పాటు చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, మునిసిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, టీడీపీ కృష్ణాజిల్లా తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, ఎండి ఇలియాస్ పాషా, పిప్పళ్ళ కాంతారావు, తలారి సోమశేఖర్, వాలిశెట్టి తిరుమలరావు, లంకే నారాయణ ప్రసాద్, మరకాని పరబ్రహ్మం, కాగిత వెంకటేశ్వరరావు, కాగిత గోపాలరావు, లంకిశెట్టి నీరజ, కార్పొరేటర్ మరకాని సమతాకీర్తి తదితరులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరుపై ప్రత్యేక అభిమానం : వెనిగండ్ల

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు అంటే తనకు ఎప్పటికీ ప్రత్యేక అభిమానం ఉంటుందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. కొసరాజు బాపయ్య చౌదరి ప్రజా వేదికపై సోమవారం జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పాల్గొన్నారు. సమర్థుడైన చంద్రబాబు పాలనతో ప్రజలు ఎంతో సంతృప్తిగా ఉన్నారన్నారు. ఎమ్మెల్యే రాముని టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. మండల టీడీపీ అధ్యక్షుడు కొసరాజు బాపయ్య చౌదరి, ఏఎంసీ మాజీ ఛైర్మన్ వల్లభనేని వెంకట్రావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పొట్లూరి రవి కుమార్, జిల్లా టీడీపీ మాజీ ఉపాధ్యక్షుడు జంగం మోహనరావు, జిల్లా పాలత్పత్తిదారుల సంఘం డైరెక్టర్ వి.వి.కేబి సుబ్బారావు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు పళ్ళెం నరసింహారావు, ఎంపీడీవో కృష్ణవేణి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ కనకదుర్గ, మాజీ సర్పంచ్ చాపరాల బాలాజీ, పోలవరపు వెంకటరావు, రంగబాబు, ప్రభాకరరావు, నాగేశ్వరరావు, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యం : ఎంపీ బాలశౌరి

పామర్రు : అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. నిమ్మలూరులో సోమవారం జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజాతో కలిసి ఆయన పాల్గొన్నారు. వందరోజుల పాలన పట్ల అన్ని వర్గాల ప్రజలు పూర్తి సంతృప్తి కరంగా ఉన్నారన్నారు. ఎంపీ బాలశౌరి ఎమ్మెల్యే కుమార్‌రాజాతో కలిసి కేకు కట్ చేశారు. ఎల్లకుర్రు, ప్రాకెర్ల గ్రామాల్లో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తాడిశెట్టి నరేష్, కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, వల్లూరిపల్లి గణేష్, గొట్టిపాటి లక్ష్మీదాస్, సందీప్ దాలిపర్తి ప్రసాద్, నూకవరపు వీరాంజనేయులు, చాట్ల రమేష్, కేదారిశిపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. **ఘంటసాల** : గోగినేనిపాలెంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం సోమవారం జరిగింది. టీడీపీ నాయకులు కుంపటి సుబ్బారావు, సచివాలయ ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి 100 రోజుల్లో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. **తోట్లవల్లూరు** : చినపులిపాకలో క్లస్టర్ హెడ్ కొత్తపల్లి రవికిరణ్, కాగిత నాంచారయ్య ఆధ్వర్యంలో సోమవారం కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో సాధించిన విజయాలను ప్రచారం చేశారు. ఇది మంచి ప్రభుత్వమని స్టిక్కర్‌లు పంపిణీ చేశారు.



దాతలకు ధన్యవాదాలు : వెనిగండ్ల

గుడివాడ : వరద బాధితులకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ చేతులెత్తి ధన్యవాదాలు తెలుపుతున్నానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. రాజేంద్రనగర్‌లోని ఆయన స్వగృహంలో మహిళా సంఘాల నాయకులు ముఖ్యమంత్రి సహాయ నిధికి చెక్కులను అందజేశారు. మాంటిసోరి మహిళా సంఘం రూ.లక్ష, అన్నే నరసింహారావు, పుష్పలీలావతి దంపతులు రూ.లక్ష, యలమంచిలి నాగేశ్వరరావు దంపతులు రూ.2వేలు చొప్పున చెక్కులను ఎమ్మె ల్యే రాముకు అందజేశారు. మాంటిస్సోరి మహిళ సంఘ అధ్యక్షురాలు వల్లూరుపల్లి లక్ష్మీ, ఉపాధ్యక్షురాలు జాస్తి రాజ్యలక్ష్మీ, కార్యదర్శి వల్లూరుపల్లి శారత, కోశాధికారి ఝూన్సీ లక్ష్మీ, సంయుక్త కార్యదర్శి దండమూడి జయలక్ష్మీ, కాజ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి విరాళాలు



గుడ్లవల్లేరు : పురిటిపాడు గ్రామస్థులు ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.75వేలు సేకరించి సర్పంచ్ కాగిత నరేంద్ర ద్వారా గుడివాడ ఎమ్మెల్యే రాముకు సోమవారం అందజేశారు. గుడ్లవల్లేరుకు చెందిన విశ్రాంత ఉపాధ్యా యుడు సూరపనేని పరంధామయ్య ముఖ్యమంతి సహాయ నిధికి రూ.50 వేలు అందజేవారు. మరో రూ.50 వేలను అన్న క్యాంటీన్ నిర్వహణ కోసం ఎమ్మెల్యే రాముకు చెక్కును అందజేశారు. వెణుతురుమిల్లి గ్రామానికి చెం దిన ప్రభాకర్ తాను చెప్పులు కుట్టుకొని జీవిస్తూ కూడా తన వంతుగా రూ.1000 అందజేశారు. వెణుతురుమిల్లి గ్రామ రైతులు టీడీపీ నాయకులు పిచ్చేశ్వరరావు తదితరులు ఆధ్వర్యంలో వరిగడ్డిని ఎమ్మెల్యే సమక్షంలో పంపారు.

పారిశుధ్య కార్మికుల సేవలు మహోన్నతం

గుడివాడ : సమాజ ఉన్నతికి అహర్నిశలు శ్రమిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ, పారిశుధ్య కార్మికులు చేస్తున్న సేవలు మరువలేనివని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. సోమవారం ఏరియా ప్రభుత్వాసుపత్రిలో సఫాయి మిత్ర సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అక్టోబర్ 2వ తేదీ వరకు ఆసుపత్రిలో వైద్యశిబిరం కొనసాగుతుందని ఎమ్మెల్యే రాము తెలిపారు. ఆసుపత్రి సూపరిటెండెంట్ ఇందిరా దేవి, నాయకులు పెద్దు శ్రీకాంత్, యార్లగడ్డ సుధారాణి, పోలాసి ఉమ, యర్రపోతు అర్జున్, నూరే లక్ష్మీనారాయణ(గాంధీ), ఎంపిడివో ఏ.వి రమణ, అధికారులు పాల్గొన్నారు.

పామర్రు : పారిశుధ్య కార్మికుల ఆరోగ్య భద్రతే ఎన్డీయే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా అన్నారు. పారిశుధ్య కార్మికుల ఆరోగ్య వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. మాజీ ఎంపీపీ గొట్టిపాటి లక్ష్మిదాస్, జనసేన ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, వల్లూరిపల్లి గణేష్, కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రమీల, పీహెచ్‌సీ వైద్యులు నాగేశ్వరరావు, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల ఈవోగా శ్రీరామ వరప్రసాద్



మోపిదేవి : చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల ఈవోగా దాసరి శ్రీరామ వరప్రసాద్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానం ఈవోగా పని చేస్తున్న ఆయన డిప్యూటీ కమిషనర్ హోదాలో మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థా నం ఈవోగా బదిలీపై వచ్చారు. ఉదయం ఆయన స్వామివారిని దర్శించుకున్నారు. ఎస్టేట్ దేవాలయాల ఉద్యోగులు ఆయనను కలసి అభినందనలు తెలియజేశారు.

భీమేశ్వరస్వామి గ్రూపు దేవాలయాల ఈవోగా గోపాలరావు



గుడివాడ : గుడివాడలోని భీమేశ్వరస్వామి గ్రూ పు దేవాలయాల ఈవోగా కందూరు గోపాలరావు నియమితులయ్యారు. ఏ లూరు జిల్లా కైకలూరు మండలం కొల్లేటికోట పెద్దింట్లమ్మ గ్రూపు దేవాలయాల ఈవోగా పనిచేస్తూ ఆయన బదిలీపై వచ్చారు. భీమేశ్వరస్వామి రి దేవస్థానంతో పాటు గ్రూపు దేవాలయాలైన వేణుగోపాల స్వామి, శ్రీదేవరకొండ నాగన్న సత్రం, వెంకటేశ్వర స్వామి దేవస్థానం, గౌరీశంకరస్వామి దేవస్థానం, ఘంటసాల నాగభూషణం అన్నదాన సత్రం ఈవోగా గోపాలరావు వ్యవహరిస్తారు.

గుడివాడ ఎంపీడీవోగా విష్ణప్రసాద్



గుడివాడ రూరల్ : గుడివాడ ఎంపీడీవోగా డి.వై. విష్ణుప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేస్తున్న అనగాని వెంకటరమణ చల్లపల్లి బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన విష్ణుప్రసాద్‌కు ఏఈలు, కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

పామర్రు ఎంపీడీవోగా జ్యోతి



పామర్రు : పామర్రు ఎంపీడీవోగా కె.జ్యోతి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న వై.రామకృష్ణ ఏలూరు జిల్లా ముదినేపల్లికి బదిలీ అయ్యారు.

చెస్ ఒలింపియాడ్‌లో భారత్ విజయంపై సంబరాలు

అవనిగడ్డ : చెస్ ఒలింపియాడ్‌లో బంగారు పతకం సాధించడం దేశానికే గర్వకారణమని దివి చెస్ ఆర్గనైజేషన్ నిర్వాహకులు జల్లూరి వెంకట భరత్ అన్నారు. దివి చెస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఒలింపియాడ్‌లో భారత్ బంగారు పతాకం సాధించిన సందర్భంగా విజయోత్సవం నిర్వహించారు. ఓపెన్ కేటగిరీ, ఉమెన్ కేటగిరీ, సింగిల్స్‌లో ఆరు బంగారు పతకాలు సాధించటం విశేషమన్నారు. విజయాన్ని విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. ఉపాధ్యాయులు కె.కోటేశ్వరి, ఎం.ఉదయకుమార్, ఎస్.శ్రీకాంత్, ఏ.భాను ప్రకాష్, వీర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం మండల కమిటీ సమావేశం

ఘంటసాల : సీపీఎం మండల కమిటీ సమావేశం బలే రమేష్ అధ్యక్షతన ఘంటసాలలో సోమవారం జరిగింది. జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులు మాదల వెంకటేశ్వరరావు హాజరయ్యారు. తొలుత సీతారామ్ ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అక్టోబరు 16న ఘంటసాల మండల మహాసభ జరపాలని తీర్మానించారు. సీపీఎం నేతలు మేడంకి వెంకటేశ్వరరావు, వెనిగళ్ల నాగమణి, జటావతు శివశంకర నాయక్, వాకా రామచంద్రరావు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ కోటేశ్వరరావు మృతి

నాగాయలంక : వక్కపట్లవారిపాలెం ఫీల్డ్ అసిస్టెంట్ మీసాల కోటేశ్వరరావు ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. ఏపీవో టి.వి.ఎస్.ముత్యాలు సోమవారం కోటేశ్వరరావు భౌతికకాయాన్ని సందర్శించి మట్టి ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం తరఫున రూ.15 వేలు కుటుంబానికి అందజేశారు. పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లు కోటేశ్వరరావు భౌతిక ఖాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

బుసక టిప్పర్ బోల్తా

కూచిపూడి : చల్లపల్లి వైపు నుంచి బుసక లోడుతో వెళ్తున్న టిప్పర్ అదుపు తప్పి పంట కాలువలోకి బోల్తా కొట్టిన సంఘటన మొవ్వ - కూచిపూడి ప్రధాన రహదారిలో ఆదివారం తెల్లవారుజామున జరిగింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవటం, ఎదురుగా వాహనాలు రాకపోవటంతో ప్రమాదం తప్పింది. డ్రైవ ర్ నిద్రమత్తులో ఉండటం వల్ల ఈ సంఘటన జరిగినట్లు తెలుస్తోంది.

వితంతువులకు నిత్యావసర సరుకులు

అవనిగడ్డ రూరల్ : పాత ఎడ్లంకలోని వితంతువులకు యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.కనకరావు ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు అందజేశారు. యూటీఎఫ్ నేతలు నీలం ప్రభాకరరావు, జిల్లా కార్యదర్శులు బి.జి.గోపాలకృష్ణ, ఎన్.వెంకటేశ్వరరావు, లంకా నరేంద్ర, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ పి.శివ కోటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు వి.రాజారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు నున్న ఆంజనేయులు, మండల బాధ్యులు కె.జీవేంద్రరావు, బి.శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అశోక్ నాయుడికి పరామర్శ

కోడూరు : చిరంజీవి యువత అవనిగడ్డ నియోజకవర్గ అధ్యక్షుడు, జనసేన పార్టీ నాయకులు సిద్ధినేని అశోక్ నాయుడును ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్ సోమవారం పరామర్శించారు. అశోక్ నాయుడు మాతృమూర్తి సిద్ధినేని లక్ష్మి చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. పార్టీ నేతలు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి కూటమి నేతల పూజలు



కోడూరు : తిరుపతి లడ్డూను అపవిత్రం చేసిన వారిని మన్నించాలని కోరుతూ మండలి వెంకట్రామ్ సోమవారం కోడూరులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్థానిక కూటమి నేతలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వర స్వామి దేవాలయ ప్రతిష్ట దెబ్బతీసేందుకు వైసీపీ హయాంలో అనేక కుట్రలు జరిగాయని ఆరోపించారు. కూటమి నాయకులు మర్రే గంగయ్య, లంకే యుగంధర్, కొండవీటి సునీత, కోట రాంబాబు, కొల్లి వెంకటేశ్వరరావు, పూతబోయిన కరుణ కుమార్, పూతబోయిన సీతారత్న సాయిబాబు, జరుగు ఆదినారాయణ, కాగిత రామారావు, కొల్లి వెంకటేశ్వరరావు, జరుగు పోతురాజు, కోట సురేంద్ర, కోట సుబ్బారావు, పూషడపు భాను, జరుగు లక్ష్మణ, చందు రామారావు, బాదర్ల లోలాక్షు నాయుడు, సాలెంపాలెం ఎంపిటిసి లంకే భాస్కరరావు పాల్గొన్నారు.

అడ్డమైన పనులు మేము చేయం



ఎంపీడీవో రెడ్డయ్యకు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

పెడన రూరల్ : సచివాలయ ఉద్యోగులకు కార్యాలయం పనిచేసే వేళల్లోనే పనులు చెప్పాలని, ఇతరత్రా పనులు చెప్పడంతో మనోవేదనకు గురౌతున్నారని పేర్కొంటూ సచివాలయ వెల్ఫేర్, డిజిటల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు సోమవారం ఎంపీడీవో రెడ్డయ్యకు వినతిపత్ర సమర్పించారు. ప్రతినెలా పింఛన్ల పంపిణీ సమయంలో తెల్లవారు జామున రమ్మని ఆదేశాలు ఇవ్వటం నిబంధనలకు విరుద్ధమని వినతిపత్రంలో పేర్కొన్నారు. పాఠశాలల మరుగుదొడ్ల ఫొటోలు తీయటం, ఇది మంచి ప్రభుత్వం అని ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లు అంటించటం లాంటి పనులతో ఉద్యోగుల మనోభావాలు దెబ్బతింటున్నాయని వివరించారు. అధికారుల ఒత్తిడితో మానసికంగా దెబ్బతింటున్నామన్నారు. ఉన్నత చదువులు చదివిన తమతో ఈవిధమైన పనులు చేయించడం సరికాదన్నారు. ఈ విషయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సిందిగా కోరారు. జగపతి, శివనాగరాజు, భాస్కర్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కు మద్దతుగా జనసేన నాయకుల దీక్ష



గుడివాడ : తిరుపతి లడ్డూ అపవిత్రమైన కారణంగా ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా గుడివాడలో జనసేన నాయకులు దీక్ష చేపట్టారు. భీమేశ్వరస్వామి దేవస్థానంలో జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ ఆధ్వర్యంలో 116 కొబ్బరికాయలు కొట్టి దీక్షను ప్రారంభించారు. జనసేన నాయకులు మజ్జి శ్రీనివాసరావు, వేమూరి త్రినాధ్, సాయన రాజేష్, కల్యాణి, దుర్గ, బిజెపి నాయకులు యర్రపోతు అర్జున్, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వరద బాధితులకు వంట పాత్రల పంపిణీ

అవనిగడ్డ రూరల్ : నియోజకవర్గ విద్యాకుటుంబం ఆధ్వర్యంలో ఎడ్లంక, పల్లెపాలెం వరద బాధితులు 400 కుటుంబాలకు వంట పాత్రలు, కుక్కర్లు పంపిణీ చేశారు. మండలి వెంకట్రామ్, కనపర్తి శ్రీనివాసరావు అన్నారు.ఎంఈవోలు టివి.ఎం.రామదాసు, అన్నపరెడ్డి పిచ్చియ్య, వి.శ్రీనివాసరావు, యూటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.కనకరావు, డెమొక్రటిక్ పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జివి.ఎస్.పెరుమాళ్లు, జిల్లా అధ్యక్షుడు మేడా బాబ్జీ, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.నాగప్రసాద్, సర్పంచ్ పాలేపు సామ్రాజ్యం, కూటమి నాయకులు కొల్లూరి వెంకటేశ్వరరావు, గుడివాక శివరావు, బండే రాఘవ, యలవర్తి ఆది, భోగిరెడ్డి బుజ్జి, కొల్లూరి వాసు పాల్గొన్నారు.

కోసూరులో వైఎస్సార్ విగ్రహానికి పసుపు కండువా!

కూచిపూడి : కోసూరు గ్రామంలో ప్రధాన సెంటర్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి పసుపు కండువా వేయటంతో ఆయన అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పార్టీ నేతలు కూచిపూడి పోలీసులతోపాటు పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్‌కు సమాచారం అందజేశారు. కూచిపూడి ఎస్సై సుబ్రహ్మణ్యం ఇద్దరు కానిస్టేబుళ్లను ఏర్పాటు చేసి గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు. ఏ నిముషంలో ఏం జరుగుతుందోనని గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు.

అలరించిన సత్యహరిశ్చంద్ర



నాగాయలంక : మత్స్యకార కళాకారులు ఆదివారం రాత్రి నాగాయలంక వినాయకుని పందిరిలో ప్రదర్శించిన సత్య హరిశ్చంద్ర పౌరాణిక నాటక ప్రదర్శన ప్రేక్షకులను విశేషంగా అలరించింది. ప్రముఖ పారిశ్రామికవేత్త, విక్కుర్తి వీర రాఘవయ్య ట్రస్టు అధ్యక్షుడు విక్కుర్తి శ్రీనివాస్, మత్స్యకార నేత చిలకలపూడి పాపారావు ఆర్థిక సౌజన్యంతో శ్రీరామా నాట్య మండలి ఆధ్వర్యంలో కొప్పనాతి మౌలాలి నిర్వహణలో హరిశ్చంద్ర నాటక ప్రదర్శన జరిగింది. విక్కుర్తి శ్రీనివాస్‌ను, చిలకలపూడి పాపారావులకు మత్స్యకార పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు. ఒకటో హరిశ్చంద్రుడిగా బొమ్మిడి సత్యనారనాయణ, రెండో హరిశ్చంద్రుడిగా తాతారావు (అరణ్య సీను), మూడో హరిశ్చంద్రుడిగా మౌలాలి (వారణాసి సీను), నాలుగో హరిశ్చంద్రుడిగా నెప్రహా (కాటిసీను), విశ్వామిత్రగా జగన్మోహన్‌రావు, నక్షత్రకుడుగా మోహనరావు నటించి మెప్పించారు.

నేటి నుంచి పొలం పిలుస్తోంది

గుడివాడ రూరల్ : పొలం పిలుస్తోంది కార్యక్రమం గుడివాడ, నందివాడ, పెదపారుపూడి మండలాల్లో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి ప్రారంభిస్తున్నట్లు ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి సోమవారం తెలిపారు. మంగళ, బుధ, గురువారాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందని, దానికి అనుబంధ శాఖలైన పశు సంవర్ధక, ఉద్యాన, హార్టికల్చర్ శాఖల అధికారులు హాజరవుతారన్నారు. ఆయా మండలాల్లోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. గుడివాడ రూరల్ మండలంలో లింగవరం, వలివర్తిపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరుగుతుందన్నారు.

గూడూరు మండలంలో అధికారులు, సిబ్బంది బదిలీ

గూడూరు : గూడూరు ఎంపీడీవో సుబ్బారావు ఘంటసాలకు బదిలీ అయ్యారు. జూనియర్ అసిస్టెంట్ ఎం.రోహిత్‌ను జడ్పీకి బదిలీ చేసి అక్కడ పని చేస్తున్న రిజ్వానా బేగంను నియమించారు. మండల సర్వేయర్ వెంకటేశ్వరరావును మచిలీపట్నం బదిలీ చేసి, కోడూరు సర్వేయర్ కె. మురళీకృష్ణను ఇక్కడ నియమించారు. గన్నవరం డీటీ శ్రీనివాస్‌ను గూడూరు డీటీగా, జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న టి. రాధను గూడూరు సీనియర్ అసిస్టెంట్‌గా, గూడూరు ఎంఆర్‌ఐ షేక్ నస్రీన్ ఆరా కలెక్టర్ కార్యాలయానికి, జూనియర్ అసిస్టెంట్ సిహెచ్. దినకర్‌ను మచిలీపట్నం సౌత్ తహసీల్దార్ కార్యాలయానికి, ఆయన స్థానంలో మచిలీపట్నం నార్త్ తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న పి. ఝాన్సీరాణిని నియమించారు.

అభివృద్ధి, సంక్షేమమే కూటమి లక్ష్యం : కనపర్తి

మోపిదేవి : అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని అవనిగడ్డ నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు అన్నారు. మోపిదేవి టీడీపీ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, నాయకులతో సోమవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వంద రోజుల్లో సాధించిన విజయాలు ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనను ఘనంగా సత్కరించారు. మండల టీడీపీ అధ్యక్షుడు నడకదుటి జనార్ధనరావు, ఎంపీపీ రావి దుర్గావాణి, కొక్కిలిగడ్డ సర్పంచ్ దిడ్ల జానకిరాంబాబు, చందన రంగారావు, కొల్లూరి వెంకటేశ్వరరావు, రావి నాగేశ్వరరావు, మోర్ల జయలక్ష్మి, రావి రత్నగిరి, వేములపల్లి వెంకట్రామయ్య, దొప్పలపూడి జగదీష్, మేడికొండ విజయ్, వేములపల్లి రవిచంద్ర, నాదెళ్ల శరత్ చంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెతాళ్లపాలెంలో కూలిన వంతెన



మచిలీపట్నం టౌన్ : పల్లెతాళ్లపాలెం గ్రామంలోని వంతెన ఆదివారం అర్ధరాత్రి కూలిపోయింది. దీంతో ప్రజల రాకపోకలు నిలిచిపోయాయి. తక్షణం రవాణాకు ఏర్పాట్లు చేయాలని టీడీపీ అధ్యక్షుడు కొనకళ్ళ నాగరాజుకు మంత్రి కొల్లు రవీంద్ర సూచించారు. దీంతో సజ్జలవారిపాలెం నుంచి పల్లెతాళ్లపాలెం వెళ్ళేందుకు నడక దారి ఏర్పాటు చేస్తున్నారు. కొక్కిలిగడ్డ జయకృష్ణ, జొన్నల బాబురావు, జొన్నల సూర్యనారాయణ, చక్కా గోవిందరాజు, బొల్లా పోతురాజు, మోపిదేవి ధర్మరాజు, చక్కా ముసలి, చక్కా నాని, చక్కా స్వామి, అంకెం నాగేంద్ర ఎక్స్‌కవేటర్‌తో జంగిల్ క్లియరెన్స్ చేయించారు. వంతెన కూలిపోయిన ప్రాంతాన్ని ఎంపీడీవో, ఈవోఆర్డీ గ్రామ కార్యదర్శులు సందర్శించారు. వంతెన పునరుద్ధరించాలని మంత్రి కొల్లు రవీంద్రను ప్రజలు కోరారు.